

పెద్దపల్లి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



బస్సు ఎక్కుతున్న పోలింగ్ సిబ్బంది

# అసెంబ్లీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**● పరిశీలించిన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ● పలు డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ సెంటర్ల సందర్శన ● సిబ్బందికి పలు సలహాలు, సూచనలు**



ధర్మారం : పత్తిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సెక్టోరియల్ అధికారి జయశీల కలిసి వస్తున్న పోలింగ్ సిబ్బంది

పెద్దపల్లి, నవంబర్ 29: పెద్దపల్లిలో అసెంబ్లీ ఎన్నికలకు అంతా సిద్ధమైంది. ఎన్నికల అధికారులు, సిబ్బంది సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అక్కడే రాత్రి బస చేశారు. గురువారం ఉదయం నిర్వహించనున్న మాక్‌పోలింగ్ ప్రక్రియకు ముందుగానే సరిపోల్చుకున్నారు. కాగా బుధవారం పెద్దపల్లి కలెక్టర్, ఎన్నికల అధికారి ముజామ్మిల్‌ఖాన్ పెద్దపల్లి జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించారు. అలాగే రామగుండం, మంథని, రామగిరిలోని పలు పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు వెళ్లారు. అక్కడ ఏర్పాట్లపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని నిర్దేశించారు. ఎట్టిపరిస్థితుల్లో పొరపాట్లకు తావియ్యవద్దని కోరారు. కాగా సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట భద్రత కల్పించామని చెప్పారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేశామని, ట్రైసైకిళ్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టిపెట్టామని పేర్కొన్నారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి**

కాల్వశ్రీరాంపూర్, నవంబర్29: మండలంలోని అన్ని గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి , తహసీల్దార్ జాహెద్‌పాషా తెలిపారు. మండలంలో 41 పోలింగ్ బూత్ లు ఉండగా, 34226 ఓటర్లు, 1థర్డ్‌జెండర్ ఓటు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది**

ధర్మారం,నవంబర్ 29: మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 29 జీపీలు ఉన్నాయి. ఇందులో ధర్మారం మండలంతో పాటు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జూలపల్లి మండలం మండలం అబ్బాపూర్‌గ్రామంతో కలిపి 53 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 30 గ్రామాల్లో కలిపి ఓటర్లు 44,396 మంది ఉన్నారు. బుధవారం సాయంత్రం వరకు పోలింగ్ సిబ్బంది అన్ని గ్రామాలకు చేరుకున్నారు. ఈవీఎంలు, ఇతర సామగ్రితో సిబ్బంది పోలింగ్ స్టేషన్లకు చేరారు. కాగా సెక్టోరియల్ అధికారులు స్థానిక ఎంపీడీవో భీమ జయశీల, ఎంపీవో రమేశ్, పీఆర్ ఏఈ రాజశేఖర్, మిషన్ భగీరథ డీఈఈ రోహిత్, నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్ పోలింగ్ స్టేషన్లను పర్యవేక్షించారు. పోలింగ్ సిబ్బందికోసం అన్ని సౌకర్యాలు కల్పించారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకొని అప్రమత్తమై పర్యవేక్షణ చేస్తున్నారు.

**ప్రత్యేకంగా పర్యావరణ, యూత్ పోలింగ్ కేంద్రాలు**

మండలంలోని నంది మేడారం పంచాయతీ పరిధిలోని నల్ల లింగయ్యపల్లి, చామనపల్లిలో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లలింగయ్యపల్లిలో పర్యావరణ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని జగిత్యాల జిల్లా ఫారెస్ట్ అధికారి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ధర్మారం మండలం ఫారెస్ట్ రేంజ్ అధికారి స్వాతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వాతి పోలింగ్ స్టేషన్‌లో స్టేషన్లో ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. పర్యావరణ పరిరక్షణకు అద్దం పట్టే విధంగా కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు, బెలూన్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పోలింగ్ స్టేషన్ వద్ద వృక్షాలతో కూడిన ప్రత్యేక ఫ్లెక్సీ బ్యానర్‌ను పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసిన వారు సెల్ఫీ తీసుకోవడానికి అనుకూలంగా ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్ ఆకట్టుకుంటున్నది. చామనపల్లిలో ఈసారి 111 మంది యువతీయువకులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వారికోసం యూత్ మోడల్ పోలింగ్ స్టేషన్ ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఇక్కడి పోలింగ్ స్టేషను యువతీ యువకుల కోసం అలంకరించారు. మండలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ రెండు పోలీస్స్టేషన్లు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి.

# 1న స్పెషల్ క్యాజువల్ లీవ్

పెద్దపల్లి, నవంబర్29: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తున్నామని పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, 30న ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ ప్రకటిస్తున్నామని, ఎన్నికల విధు లు నిర్వహిస్తున్న పాఠశాల, ఇంటర్మీడియట్, కళాశాల విద్య, టెక్నికల్ విద్యాశాఖ , రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్ యూనిట్లలో పనిచేసే ఉద్యోగులకు ఈ స్పెషల్ క్యాజువల్ లీవ్ అమలవుతోందని తెలిపారు.

**వేతనంతో కూడిన సెలవు మంజూరు**

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రతి వాణిజ్య సంస్థ, దుకాణం, వ్యాపార సంస్థలలో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శామ్యూల్ జాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపెల్లి జిల్లాలోని దుకాణ, వాణిజ్య సంస్థల యజమానులు, వ్యాపారసంస్థల యజమానులు నవంబర్ 30 గురువారం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సాధారణ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనంతో కూడిన సెల వు మంజూరు చేయాలని సూచించారు. తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988 చట్ట ప్రకారం యజమానులు తప్పనిసరిగా మూసి వేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయని హెచ్చరించారు.

# రూ. 4, 90, 01, 360 జప్తు

**● రూ. 1, 23, 72,360 విడుదల**

**● జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్**

పెద్దపల్లి, నవంబర్29: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ. 4, 90, 01, 360 జప్తు చేయగా, అందులో రూ. 1, 23, 72,360 విడుదల చేశా మని పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 4, 90, 01, 360నగదు జప్తు చేశామని తెలిపారు. సంబంధిత వ్యక్తులు సమర్పించిన ఆధారాలను తనిఖీ చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ రూ. 1,23,72,360 విడుదల చేసినట్లు తెలిపారు. సరైన ఆధారాలు సమర్పించనందున రూ. 3,66,29 000 నగదు విడుదల చేయలేదన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామని, ఇప్పటి వరకు సీ–విజల్ యాప్ ద్వారా 251 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా 1752 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించామని కలెక్టర్ వెల్లడించారు.

## కాంగ్రెస్‌తోని రైతుల బతుకులు ఆగమే



ఓదెల : కాంగ్రెస్‌తోని రైతుల బతుకులు మళ్లీ ఆగమయ్యేలా ఉన్నయ్. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతు లు ఎన్నో అవస్థలు పడ్డరు. ఎంతో గోసలు పడ్డం. కరంట్ సక్కగ ఉండేది కాదు. రాత్రులు పొలం కాడికి పోయి జాగారం చేసినం. మోటర్లు, ట్రాన్స్‌ఫార్లర్లు కాలి పోయి పైసలు నష్టపోయినం. పొలాలకు నీళ్లు అందేవి కావు. ఎరువులు, విత్తనాలకు కూడా అనేక ఇబ్బందులు పడ్డం. గిప్పుడు కాంగ్రెసోళ్లు 3గంటల కరెంట్ చాలంటున్నరు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక భూముల రికార్డులు సరిజేసిన్రు. భూములకు కూడా మంచి డిమాండ్ వచ్చింది. బీళ్లు కనిపిస్త లేవు. 24గంటల పాటు కరెంట్ ఫ్రీగా ఇస్తున్నరు. లాగోడికి ఇబ్బంది పడకుండా రెండు పంటలకు రైతు బంధు ద్వారా సాయమందిస్తుర్రు. ఎ రైతులందరం సంతోషంగా బతుకుతన్నం.

**- గుగులోతు దేవిలాల్, గిరిజన రైతు, లంబాడితండా (ఓదెల)**

## నీళ్లకు.. పెట్టుబడికి రందిలేదు..



సుల్తానాబాద్ : రైతుల వ్యవసాయం చేసుకోవడానికి పుష్కలంగా నీళ్లున్నయ్. తెలంగా ణ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం ఇస్తున్నది. ఫ్రీ కరెంట్ ఇస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం చేసిన మేలు ఇంతకముందు ఏ ప్రభుత్వమూ చేయలేదు. పంటలు మంచిగ పండుతున్నయ్. పండించిన పంటలను కేంద్ర ప్రభుత్వం కొనకున్నా తెలంగాణ ప్రభుత్వం కొని ఆదుకుంటున్నది. కాంగ్రెస్‌ను నమ్మితే ఫ్రీ కరెంట్, రైతు బంధు పోతది. సాగు నీరు లేక పంటలు ఎండిపోతయి. మళ్లీ పాత రోజులు వస్తయ్. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక భూముల రికార్డులు పకడ్బందీగా ఆన్‌లైన్ చేసింది. కానీ కాంగ్రెసోళ్లు చెప్పే మాటలు వింటే అన్నీ పోయేలా ఉన్నయ్.

**గెల్లు ముత్యాలు రైతు సుల్తానాబాద్**

## ధరణి తీసేసే కాంగ్రెస్ మాకెందుకు



కాల్వశ్రీరాంపూర్ : రైతుల సమస్యలు దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చింది. అంత మంచిగున్న ధరణిని తీసేసే కాంగ్రెస్ మాటలు వింటే మొదటికే మోసం వస్తది. ధరణి తీసేసే కాంగ్రెస్‌ను తరిమికొట్టుడే. ధరణితోనే రైతుబంధు పైసలు కూడా పడుతున్నాయి. ధరణి పోతే దళారులు మళ్లీ తయారవుతారు. ధరణి పోర్టల్‌తోని అవస్థలు లేకుండా భూముల అమ్మకాలు, కొనుగోలు జరుగుతున్నది.పైరవీకారులతోని పని లేదు. అమ్మిన వ్యక్తి పేరు పోయి, కొన్న వ్యక్తి పేరుమీద ఆన్‌లైన్‌ల వెంటనే మారుతున్నది. ఇంటికే పాస్ బుక్కులు వస్తున్నయి. ఇంతకన్న ఇంకేం కావాలె. ఇంతక ముందు రిజిస్ట్రేషన్ అయినంక మ్యుటేషన్ చేయించుకోవాలంటే పట్వార్ల చుట్టూ తిరిగి తిరిగి యాష్టకు వచ్చేది. పాత పద్ధతి వస్తే భూముల రికార్డులు తారుమారవుతాయి.

**కాంటాల వీరన్న, రైతు, ఆరెపల్లె, (కాల్వశ్రీరాంపూర్)**

## ధరణి తోనే భూములకు భద్రత



కాల్వశ్రీరాంపూర్ : రైతుల ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన చేపట్టింది. ధరణిని తెచ్చింది. ఈ ధరణి పోర్టల్‌తో భూములకు భద్రత పెరిగింది . గతంలో పట్టా మార్పిడి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డం. ధరణి పోర్టల్ ను కాంగ్రెస్ తీసివేస్తామనడం మతిలేని పని. ధరణి తీసేస్తే మళ్లీ తెలంగాణ లో దళారులదే రాజ్యమైతది. ధరణిని కొనసాగించాలి. పహాణీ కోసం పట్వారీ దగ్గరికి పోతే పైసలి య్యందే పనయ్యేది కాదు.ఇప్పుడు రెండు నిమిషాల్లో పహాణీ వస్తున్నది.

**కొప్పుల సత్యనారాయణ, రైతు. కిష్టంపేట (కాల్వశ్రీరాంపూర్)**